


# ధ్వని-ప్రతిధ్వని

తిరుమల

ప్రయాణం అనగానే ఎంతో వుత్సాహంతో సామాను సర్దుకున్నాను. ఐదువందల మైళ్ళు జీపులో దారి పొడువునా మజిలీలు వేసుకుంటూ వెళ్ళడంలో వున్న హాయి ఆదరాబాదరాగా చేసే రైలు ప్రయాణంలో లేదు.

సామాను ట్రేయిలర్‌లో పెట్టి, దాన్ని జీపుకి తగిలించి ప్రయాణమయేను. అలవర్ పరిసరాలు వెనకపడ్డాయి. కొండచిలువలా పడున్న రోడ్డు–ఎత్తుపల్లాలు లేకపోవడంవల్ల తెప్పలా తేలిపోతూ పరుగెత్తుతూవుంది జీపు. వింజామరలు వీస్తూవున్నట్లు రోడ్డుకి యిరువేపులాగాలికి వూగులాడుతూవున్న వేప, మామిడిచెట్లు. ఎండ తీక్షణంగా వున్నా నీడలో ప్రయాణం హాయిగా సేద తీరినట్లువుంది. దూరంగా ఆకాశంతో కబుర్లు చెప్తూవున్న కొండలు-పచ్చని చీరకప్పుకున్న ప్రకృతి. రోడ్డు నిర్మానుష్యంగా వుంది - అప్పుడప్పుడు వచ్చే పోయే బస్సులు, లారీలు తప్ప.

సిరిస్కా-సమీపంలో పోతూవుంది

జీపు. పెళ్ళిపందిరిలో అల్లరిపిల్లల్లా చెట్ల కింద గోలచేస్తూ, గంతులేసే కొంత ముచ్చలు అంతా వన్యప్రదేశం. ఏను గులు, సింహాలుతప్ప తదితర జంతువులు విచ్చలవిడిగా తిరుగాడే సిరిస్కాలోయ. వన్యమృగాల వనం (గేమ్ స్కాంచరీ) దగ్గరవుతూవుండగా ఆరుమాసాల క్రితం పులిని చూడాలని ఒక రాత్రి నేను పడ్డ యాతన జ్ఞాపకంవచ్చింది.

ఆ రోజు వార్డన్ 8 గంటలకే నన్ను తన జీపులో తీసుకుపోయాడు టైగర్ వ్యూకి. టైగర్ వ్యూ ఎత్తుగా ఒంటి స్తంభం మేడలావుంది. వన్యమృగాలు ఎటువైపునుండి వచ్చినా లోపలకూర్చుని నిశ్చింతగా చూడ్డానికి గదికి సిమెంటు గోడలస్థానే అద్దాలు అమర్చారు. అక్క డికి కొద్ది దూరంలో చిన్నకాలువ, దానికి అంటిపెట్టుకున్న సమతల ప్రదేశంలో చెట్టుకి గొలుసుతో కట్టిన మేక. పులిని చూసేటందుకు వచ్చేవాళ్ళు ఆ గదిలో గంటలకొద్దీ కూర్చోవలసి వస్తుంది. వాళ్ళకు అన్నివిధాలా సౌకర్యంగా వుండేందుకు సోఫాలు,టీపాయిలు,నాలుగు ఫోమ్ బెడ్సు అమర్చబడి వున్నాయి. చీకటిలో మేకను తినడానికి వచ్చే పులిని చూడ్డానికి పనికివచ్చే పెద్దలైటు గోడకు దగ్గరలో వుంది.

ఆ రోజు ఉదయం గేమ్ సేంచురీ గురించి అన్నీ వివరంగా చెప్తూ "పులిని చూడాలంటె ఒకోసారి రాత్రిఅంతా టైగర్ వ్యూలో పడిగాపులు కాయాలి సుమండీ" అంటూ వార్డన్ అన్నందున సరంజామా అంతా తీసుకునే వెళ్ళాం. హాట్ కేసులో యిద్దరికి సరిపడ్డ భోజనం, మటన్ చాప్స్, ఫ్లాస్కులో కాఫీ, విసు గుని వెంబడించేందుకు వుత్సాహప్రదా యిని-విస్కీ- ఐస్‌బాక్సులో దానికి కావలసిన సోడాలు.

మేం అక్కడికి చేరకముందే ఫారెస్టు జవాను మేకను కాలవగట్టున చెట్టుకి కట్టి, గదిలో తాగడానికి నీళ్ళుకూడా పెట్టి వెళ్ళిపోయాడు ట్రాన్సిస్టర్ ఆన్‌చేసి పులికోసం నిరీక్షణ మొదలు పెట్టేం. ఆ నిశీధిలో ఏ ఆకు ఆడినా ఏ కొమ్మ కదలినా సెర్చ్‌లైట్ ఆన్‌చేసి అటువేపు చూడ్డం, పులిమహారాజు కన పడకపోగా నిరాశతో గ్లాసులో విస్కీ పోసుకుని సిప్‌చేస్తూ మళ్ళా ఎదురు చూడ్డం.

అలా గంటలు దొర్లిపోయేయి. కాని ఫలితం కనుపించడంలేదు. అప్పటికే ఒక బాటల్ విస్కీ అయిపోయింది. వుండి వుండి మ్యూ, మ్యూ అన్న నెమళ్ల అరుపులు. ఎక్కడో దూరంలో అడవి దున్న రంకెలు, నక్కల వికృత నినా దాలు. కణుసు అరుపులకు మేల్కొన్న పక్షుల గోల. నేనూ నాతో వున్న వార్డన్ తప్ప ఆ అడవిలో మరో మానవ మాత్రుడు లేడన్నది స్ఫురించగా అదో లాంటి భయంతో క్షణకాలం కదల

కుండా వుండిపోయాను. ఏ చిరుతపులో చెట్టుమీదనుండి దూకి గాజుగోడని పగలగొట్టి లోపలికి వచ్చేస్తే దాని బారి నుండి తప్పుకునే దెలా ? నా పిచ్చికాని అంత ఎత్తులోవున్న మమ్మల్ని ఏ మృగమూ చేరుకోలేదు పోత పోసిన యినపద్వారం మూసి వుండగా ఏదో వూహించుకుని భయపడ్డం వెర్రితనం. చేతికి అందే దూరంలో రెండు డబుల్ బేరల్ తుపాకులు చూచి ధైర్యం పుంజుకున్నాను.


వాచీ నాలుగు గంటలు సూచిస్తూ వుంది. కాని పులిజాడే లేదు. తెల్లవారు జాము కావొచ్చింది. ఉషాసుందరికి స్వాగతంలా అడవి కోడివుంజు అరుపులుకూడా వినిపించేయి. ప్రకృతి బాగా చల్లబడింది. ఎంత వుత్సాహంతో వచ్చేనో అంత నిరాశ ఎదురైనందుకు విసుగు, చిరాకుతో సతమతమౌతూవున్న నన్ను శాంతపర్చడానికి.

"ఈవేళ రాలేదు కాబట్టి రేపుతప్పక వస్తుంది పులి. మీరు రేపుకూడా వుండి చూడండి. నేను పేమెంటు తీసుకోను." అన్న వార్డన్‌మాటలు నన్ను కొంతవరకు సాంత్వనపరిచినా, నాలో నేను నవ్వుకున్నాను–అతని దూరపు చూపుకి, తెలివికి. ఆ ఓదార్పు అటవికశాఖకు నేను చెల్లించిన ఫీజువల్ల కాదు– నాతో కలసి విస్కీ–పుచ్చుకు తాగినందుకు. మరో రోజు నేను అక్కడవుండిపోతే తనకు మరికొంత సత్‌సాంగత్యం లభిస్తుంది నిషాసుందరి బాహువుల్లో.

అలా ముగిసిన నా పులి సందర్శన యాత్రను జ్ఞాపకంచేసుకుంటూ వుండగా చల్లగాలికి కళ్ళు మూతలుపడ్డాయి. అలా ఎంతసేపు నిద్రపోయేనో తెలియదు జయపూర్ సమీపంలో అమేరుకోట కనుపించుతూ వుండగా మగతనుండి తేరుకున్నాను.

మధ్యాన్నం రెండు కావచ్చింది ఆకలిగావుంటే బజారులో ఓ పక్క జీపు పార్కు చేయించి డ్రయివర్‌ని కాపలా వుండమని క్వాలిటీ రెస్టారెంటుకోసం దిగేను. స్ప్రింగుతలుపు లాగి లోపలకు అడుగు పెట్టగా నాకు ఎదురైంది చీకటి లోపల అమావాస్యరాత్రిలా వుంది. కాలు ముందుకి కదిపితే ఏ కుర్చీకో డీకొంటానని నిముషంపాటు అక్కడే ద్వారం దగ్గర నిల్చున్నాను. అప్పటికికాని కనుపించలేదు సీలింగులో అమర్చబడ్డ చుక్కల్లాంటి దీపాలు. ఏదో పాశ్చాత్య వాద్యసంగీతం మెల్లగా వినిపిస్తూవుంది. ఆమ్లేట్లు, మాంసంవేపుడు వాసనలు కలగాపులగంగా ముక్కుపుటాలకు సోకుతూవున్నాయి. కొండగుహలాంటి ఆ లయబద్ధ వాతావరణంలో ఆర్తనాదంలో కాఫీ పెర్కులేటర్ చీత్కారం.

కష్టమర్సు అంతగాలేరు. చాలావరకు ఖాళీగా వున్నాయి టేబిల్సు. ఒక మూల వున్న సోఫాలో కూర్చుని వెజిటెబుల్




పులావ్, మాంసం కూర, సలాడ్ తెప్పించుకుని భోజనం ముగించి ఐస్ క్రీము ఆర్డర్ యిచ్చాను.

ఎందుకో ఐస్ క్రీముతోబాటు మా బాబు నా స్మృతిపథంలో మెదిలేడు. వాడికి ఐస్ క్రీమ్ అంటే ఎంతో యిష్టం. ఐస్ క్రీము యివ్వకపోతే ఫ్రిజ్‌లోవున్న ఐస్‌క్యూబుల్ని తినేసేవాడు. రాబోతున్న గడ్డు రోజుల్ని, నేను పాల్గొనబోయే యుద్ధాన్ని, దానిలో ఎదురయ్యే యిబ్బందుల్ని వూహించుకుని, దేశం కాని దేశంలో ఒంటరిగా వదిలిపెడ్తే ఏ కష్టాంపాలౌతారోనని శ్రీమతిని, పిల్లల్ని వాళ్ళ తాతగారింటికి పంపించి, శత్రు సేనల్ని తరమడానికి యజ్ఞపశువులా నా వంటరి పయనం, యిప్పుడు వాళ్ళుండేది ఓ మారుమూల పల్లె. అక్కడ ఐస్ క్రీముకోసం ఎంతగా అల్లరిచేస్తూ వుంటాడో బాబు. ఆర్డరు రద్దుచేయాలని వెయిటర్‌ని పిలవబోతూ సగంలో ఆగిపోయాను సభ్యతగా వుండదని.

పత్రికల్లో వార్తలు, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ముక్తివాహిని చేసే దాడులు వాళ్ళకు మద్దత్తుగా మన సేనల చర్యలు, పశ్చిమ సరిహద్దులకు సేనల తరలింపు రానున్న యుద్ధానికి నాందిలా వుంది. బహుశా యుద్ధం అంటూ జరిగితే నాకు తిరుగు ప్రయాణం వుంటుందా? మళ్ళా క్వాలిటీలో యిలా తీరుబాటుగా కూర్చోగలనా? ఎన్నో ప్రశ్నాపరంపరలు నన్ను వేధించేయి.

ఒకసారి యుద్ధంలో మృత్యుముఖాన పడి, వినాశవిశాచాల వికరాల నృత్యం చూసిన నాలో ఆదోలాంటి భయం. నడిసముద్రంలో దిక్కుతెలియని ఒంటరివాడిలా, శూన్యంలో భ్రమించే ఏకాకిలా ఫీలయ్యేను. సూటిగా గుండెల్లోకి దూసుకుపోయే తుపాకీగుళ్ళు. బాగా

పండి కిందపడి ముక్కలు ముక్కలై పోయే గుమ్మడికాయమల్లే శరీరాల్ని చీల్చి తునాతునకలు చేసే గ్రెనేడులు, ఫిరంగులు. లేడిమూకల్ని తరిమే వేట కుక్కల్లా సైనికుల్ని వెంటాడి కాల్చి కుమ్మిచంపే టేంకులు, సైనికస్థావరాల్ని క్షణకాలంలో నేలమట్టంచేసి బూడిదగామార్చే బాంబర్లు కళ్ళముందు కనుపించగా కళ్ళు మూసుకుని సోఫాలోకి జారిపోయేను.

"బేరర్ యిధర్" అన్నపిలుపునన్ను సుషుప్తినుండి లేపగా కళ్ళువిప్పి చూసేను. టిప్‌కోసం బేరర్ ఆశతో వడివడిగా నా పక్కన టేబిల్‌వేపు వెళ్తూవున్నాడు. వాడు ఐస్‌క్రీము ఎప్పుడు తెచ్చి పెట్టిపోయేడో అది నీరైపోయింది. ముట్టుకుని చూస్తే కప్పు చల్లగావుంది. దాన్ని తాగి బిల్లు చెల్లించి బయటపడ్డాను.

యింటినుండి తెచ్చుకున్న భోజనం తిని కునికిపాట్లు పడ్తూవున్న డ్రయివర్‌ని లేపి జీపు నడపమన్నాను. జీపు మంచి వేగం పుంజుకుంది. ప్రకృతిలో పచ్చదనం వెతికినా కనుపించదు ఆ పరిసరాల్లో. తేమ కరువై పటుత్వంలేని భూమి ఉపవాసం చేసి శుష్కించిన యోగుల్లా ఎక్కడో వందగజాలకో తుంబ చెట్లు భికారి చిరునవ్వులా ముళ్ళపొదలు. దిగంతాలవరకు కనుపించే యిసుక దిబ్బలు. నలుగురు కలసి అల్లరిచేసినా దూరంకాని స్థబ్దత అంతటా వ్యాపించి వుంది. అనంత సముద్రంలో పడవల్లా దూరంలో కనుపించే ఒంటెలు అది ఎడారికి వాకిలని తెలియజేస్తూ వున్నాయి.

ఢాం అన్న పెద్ద శబ్దంతోపాటు జీపు వెనకభాగం కుడివేపుకి ఒరిగిపోతూ జీపువేగం తగ్గిపోయింది. నాకు వెంటనే అర్థం అయిపోయింది జీపు వెనకటైరు పాడైపోయిందన్న విషయం. డ్రయివర్‌ని జీపు ఆపమన్నాను.

"స్పేరు వీలు ఎక్కించు" అన్న నా మాటలు అర్థంకానట్లు దీనానాథ్ దిక్కులుచూడ్డం నాకు కోపం తెప్పించింది.

"వీలు మార్చమంటే ఏమిటా దిక్కులు చూడ్డం" అన్న నా కరకుతనంకి వాడు భయపడ్తూ

"స్పేరు వీలులో గాలి లేదు సాహబ్. జయపూర్‌లో గాలి నింపాలనుకున్నాను. కాని మర్చిపోయేను. గాలిపంపు కూడా లేదు" అంటూ ఏడుపుముఖం పెట్టేడు.

అక్కడికి దగ్గరలో ఏ వూరూ వున్నట్లు లేదు, సహాయం కావాలంటే యిచ్చేవారు లేరు. బస్సుకానీ లారీకానీ రావడంలేదు. గోధూళివేళ కావచ్చింది. గుండ్రని అగ్నిగోళంలా మారి పశ్చిమాద్రిలోకి యింకిపోతూ వున్నాడు సూర్యుడు. దూరంలో ఎవరో ఒంటెమీద వస్తూవుండడం కనుపించగా ఆశగా అతని రాకకై నిరీక్షణం ఒంటె

మేంవున్న వేపు రావడం చూచేక అతన్ని పిలవమన్నాను దీనానాథ్‌ని.

రోడ్డు చేరుకుని వాహనం దిగి దగ్గరగా వచ్చి యూనిఫారంలోవున్న నాకు సెల్యూటుచేసి కరచాలనంకోసం చేయి అందించేడు ఆ వ్యక్తి. కరచాలనంచేస్తూ, తనపేరు రుధిర్‌సింగు అని చెప్తూవున్న అతని రూపురేఖలు నన్నెంతో ఆకర్షించేయి. వార్ధక్యంలో కూడా తాటిచెట్టులా నిలుచున్న అతని భారీశరీరం, పొడవైన ముక్కు, తెల్లగా నెరసిపోయిన గడ్డం, పసుపురంగు తలపాగాలోవున్న అతనిలో అదోలాంటి గంభీరత, సౌమ్యత కొట్టవచ్చినట్లు కనుపించేయి.

నేను మా పరిస్థితి చెప్పబోతూ వుండగా ఆ పని తనదైనట్లు మా సమస్య అతనితో చెప్పేడు డ్రయివర్ ధీనానాథ్.

"ఈ పాటిదానికే మీరు బెంబేలుపడిపోతారా? ఈ రాత్రికి మా గ్రామంలో నా అతిథిగా వుండండి. యిక్కడికి ఒక మైలు దూరం మా వూరు. అక్కడికి పోకరన్ పది మైళ్ళు. రేపు టైరు బాగుచేయించుకుని మీరు వెళ్ళిపోవచ్చు" అంటూ మా సమస్య పరిష్కరించేసినట్లు నా వేపు చూచేడు.

"మేం రేపు మధ్యాన్నంకి జైసల్మేరుకి యింకా వందమైళ్ళు దూరంలో వున్న మా కేంపుకి వెళ్ళిపోవాలి. అందుకు ఎలా చూచినా మేం తెల్లవారి 6 గంటలకి యిక్కడనుండి బయలుదేరిపోవాలి" అన్నాను రుధిర్‌సింగుతో.

"అలా అయితే మీరు నా యింట విశ్రాంతి తీసుకోండి. నేనూ మీ డ్రయివరూ ఏ లారీలోనో పోకరన్‌పోయి ఈ రాత్రికే టైరు బాగు చేయించుకుని వచ్చేస్తాం. అప్పుడు మీరు తెలతెలవారుతూవుండగా బయలుదేరిపోవచ్చు." అంటూ ఆశగా నావేపు చూస్తూవున్న రుధిర్‌సింగుని మనసులోనే అభినందించేను.

మైలుదూరం గాలిలేని చక్రంతో జీపు ఎలా నడపడం అన్నది మరో సమస్య అయి కూర్చుంది యింకో దారి కనపడక, మసకచీకట్లు క్రమ్ముకువస్తూ వుండడంచేత ఏది ఎలా పోనీ-పీలుడ్రమ్ పాడైనా సరేనని జీపు మెల్లగా రోడ్డు పక్కనున్న యిసుకలో నడుపుకుంటూ పల్లె చేరుకున్నాం.

లెఖ్ఖకు పదియిళ్ళ గ్రామం అది. మట్టి గోడలపై నాలుగైదు అడుగులు పొడవు రెండు అడుగులు వెడల్పులో వున్న రాళ్ళను గోడలపై వుంచగా తయారైన యిళ్ళు అవి. పల్లెకు వంద గజాల దూరంలో ఓ నుయ్యి. నూతికి నాలుగు వేపులా నాలుగు గిలకలు. నూతికి ఆనుకుని పశువులు నీళ్ళు త్రాగడానికి రాళ్లతో కట్టిన కుండీలు నాలుగు

రుధిర్‌సింగు ఒక యింటిముందు ఆగి

"మొహిణా రెండుచెంబుల్లో నీళ్ళు తీసుకురా" అన్నాడు

మొహిణా బహుశా అతని భార్యో కోడలో అయివుండొచ్చు అనుకుని ఆ యింటివేపు చూచేను .రాళ్ళను వరుసగా పేర్చగా తయారైన ప్రహరీ గోడల మధ్య వుంది ఆ యిల్లు. దరిదాపుల్లో నేలమీద ఓ గడ్డిపోచకూడా లేక దూళి రేగుతూ వుంది అంతటా ఆ యింటికి కొద్ది దూరంలో నాలుగు ఆవులు తీరుబాటుగా పడుకుని మూతులుతిప్పుతూ వున్నాయి. ఈ ఎడారిలో ఏం తిని అంత పుష్టిగా వున్నాయి? బహుశా కంటికి అందని, పాతాళంకి దారిలావున్న లోతుగల నుయ్యి నీళ్ళు తాగడంవల్లనేమో వాటికి ఆ పుష్టి

గుండెలవరకు ముసుగులో ఓ స్త్రీ సిగ్గుతో ద్వారంవరకు వచ్చి రెండు నీళ్ళ చెంబులు పెట్టి తుర్రున లోపలకు జారుకుంది. ఆమె ఆకారం, శరీరసౌష్టవం, పొందికబట్టి ఆమె లేతప్రాయపు స్త్రీలా వుంది.


తరువాత రుధిర్‌సింగు చెప్పగా నా వూహ గురితప్పలేదని ఋజువైంది. మొహిణా రుధిర్‌సింగు కోడలు. తన కొడుకు పంజాబు సరిహద్దులో వుండడం చేత కోడలు తనకు సహాయంగా వుంటూ వంటా వార్పూ పొలంపనులకు చేదోడుగా అక్కడ వుంటూవుంది.

నా కోసం ఒక కుర్చీ తీసుకువస్తే దానిలో కూర్చున్నాను నాకు కొద్ది దూరంలో ఒక మంచంవేసి కూర్చోమంటే దీనానాధ్ ఒకంతకూ కూర్చోలేదు నా ఎదురుగా కూర్చోడానికి భయపడూ వున్నాడని.

"యిది యూనిట్ కాదుగా, కూర్చో. కొంతవిశ్రాంతి లభిస్తుంది" అని నేను అన్నతరువాత యిబ్బందిగా నానుండి ముఖం చాటు చేసుకుని కూర్చున్నాడు.

మొహిణాకాకుండా యింకా యింటిలో ఎవరున్నారో తెలుసుకోవాలనే నా వుత్సాహాన్ని అణగదొక్కుకున్నాను-అది నా హోదాకు సరితూగదని. అంతలో నా మనసులోని మాట పసిగట్టినట్లు స్వయంగా రుధిర్‌సింగు చెప్పుకొచ్చేడు తన విషయాలు.

"సాహబ్! నేను కూడా ఆర్మీలో మూడు దశాబ్దాలు వుద్యోగంచేసి సుబేదారుగా రిటైర్ అయ్యేను. నాకు ఒక కొడుకు, ఒక కూతురు కుమార్తెకు రెండు సంవత్సరాలైంది పెళ్ళిచేసి. యిక్కడికి ఐదుమైళ్ళ దూరంలో వున్న పలసణావాళ్ళ అత్తవారి వూరు. ఆమెకు సుస్తీగా వుందని కబురువస్తే ఈవేళ అక్కడికి వెళ్ళివస్తూవుంటే దారిలో మీరు కలిసేరు. వయసులో వుండగా వుద్యోగ రీత్యా నాకు దూరంగావున్నా నా కష్టాలు పంచుకుని రెండు రత్నాల్లాంటి బిడ్డల్ని కని నాకు ఎంతగానో సుఖపెట్టింది నా భార్య తీరా నేను వుద్యోగంవదిలి




యిక్కడికి చేరుకున్న తరువాత ఈ ఆఖరి రోజుల్లో తోడగావుంటూ మనవల్ని ఎత్తుకోకుండా తనదారి తను చూసుకుని పరలోకాలకు వెళ్ళిపోయింది. యిది అన్యాయం కాకమరేంటి?" అంటూ కళ్ళు మడుచుకుని మళ్ళా చెప్పడం ప్రారంభించేడు.

"ప్రభుత్వం నన్ను బాగానే చూసింది ఇనాముగా పదిఎకరాలభూమి, పెన్షనూ- నాకేం లోటు లేదు- నాకు లేనిదల్లా ఏనుగులాంటి కొడుకు నా కళ్ళ ఎదుట లేకపోవడం ఎంతో చెప్పేను మావాడికి, ఈ ఉద్యోగాలు, ఈ దేశాటన వద్దు, వున్న పొలం చూసుకుంటూ భార్యతో నా కళ్ళముందు మసలమని. కాని వాడు లక్ష్యపెట్టకుండా తరతరాల నుండి వస్తూవున్న రివాజుగా సైన్యంలో చేరిపోయేడు. యిప్పటికీ అంటాడు, దేశంకోసం బ్రతకడంలో వున్న హాయి మరింకో వుద్యోగంలో లేదని యిక్కడి సంపద చూడ్డానికి నేను, మొహిణా వున్నాం అన్నది వాడి ధైర్యం-సంవత్సరానికి ఒకసారి వచ్చి మాకు రెండు నెలలు వసంతఋతువు చవి చూపించి దేశాలమీదకు పోతూవుంటాడు. యిలాంటి బ్రతుకులు మా రాజపుత్రులకు అలవాటే లెండి నా కొడుకు సైన్యంలో చచ్చిపోతాడని లేదా వాడు యింటిపట్టున లేకపోతే మాకు ఏదో నష్టం అని కాను నేను విచారించేది. నా బాధంతా నా కోడలిపిల్లకోసం. భర్త సాన్నిధ్యంలో వలపులు పండించుకునే వయసులో ఏకాంతవాసం చేస్తూ కుమిలి పోతూవున్న మొహిణాని చూస్తూవుంటే ఎక్కడలేని కోపం వస్తూవుంటుంది మా వాడిమీద. యౌవ్వనం, ప్రేమలు దేశంకోసం ధారబోస్తూ ఒకోసారి ప్రాణాలే దేశంకోసం సిరాజనంగా సమర్పించుకోవడం మా రాజ

పుత్రులకు ఉగ్గుపాలతో నేర్పిన విద్య. ఉవ్వెంగే కోరికల్ని తమలో దాచుకుని, బాధకు, విరహవేదనకి సమిధులై పోతూ వుంటారు మా స్త్రీలు" అంటూ చెప్తున్న వాడల్లా తక్కున ఆగిపోయి,

"క్షమించండి. యింటికి తీసుకు వచ్చిన మీకు అతిథి మర్యాదలు చేయడం బదులు మీకు నా సోదితో విసుగు కలిగించేను. మరోలా అనుకోవద్దు" అని వడివడిగా యింటి లోపలికి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి ఒక స్టూలు తీసుకువచ్చి నా ముందు వుంచి, భోజనం తీసుకురమ్మని కోడలిని పిలిచేడు రుధిర్ సింగు.


మేఘంలోనుండి బయటపడ్డ పూర్ణ చంద్రబింబంలా వుంది మొహిణా. ఈ సారి ముసుగు లేకుండానే వచ్చింది. గుండ్రని ముఖానికి అందాన్నిచ్చే కుదురైన ముక్కు, మిలమిలా మెరిసే కళ్లు- ఆ కళ్ళలోని చిలిపితనం నాకు ఆమె స్వాగతం చెప్తూ వున్నట్లనిపించింది. ఎత్తైన ఆమె విగ్రహం, దాచుకున్నా దాగని శరీరం వంపులు నన్ను కవ్వించ సాగేయి. నునుపైన ఆమె మెడమీద సోయగాల్ని చూస్తూ వుంటే ఒళ్ళు పులకరించి ఎవరో గిలిగింతలు పెట్టినట్లయింది. దగ్గరలో నన్ను మరి నాలుగు కళ్ళు కూడా చూస్తూవున్నాయనేది కూడా మర్చిపోయి ఆమెనే తదేకంగా చూస్తూ వున్న నన్ను తప్పించుకోవాలని కాబోలు థాళీ స్టూలుమీదపెట్టి లోపలికి వెళ్ళిపోయింది ఆ స్వప్నసుందరి.

నా ప్రవర్త చూసిన రుధిర్ సింగు ఏమనుకున్నాడో అనే భయం, సిగ్గువల్ల నామీద నాకే చికాకు, కోపం వచ్చేయి. మొక్కజొన్నపిండితో చేసిన రెండు చపాతీలు పెంకుల్లా గట్టిగా వున్నాయి. వాటితో కూర బదులు ఎండుమిరప కాయల ఆవకాయ. ఆ థాళీని అక్కడే పారబోసి నీళ్ళుతాగి సరిపెట్టుకోవాలనుకున్నాను. కాని నా ప్రవర్తనవల్ల రుధిర్ సింగు, మొహిణా బాధపడ్తారని పెంకుల్లాంటి ఆ చపాతీలు అతి కష్టం మీద తిన్నాను. జీపులోవున్న ఆపిల్సు తీసుకువచ్చేడు డ్రయివర్. వాటిలో ఒకటి నేను తీసుకుని తక్కినవి లోపల మొహిణాకి అందజేయమన్నాను.

నేను అన్యమనస్కంగా తిండిలో లీనమైనప్పుడు కాబోలు రుధిర్ సింగు, దీనానాథ్ భోజనం ముగించేరు.

నన్ను లోపలకు పోయి విశ్రాంతి తీసుకోమని చెప్పి టైరు బాగుచేయించి గాలి నింపడానికి డ్రయివర్ తోబాటు రుధిర్ సింగు కూడా వెళ్ళిపోయాడు పోకరన్.

ఒంటరిగా కూర్చున్నాను. బయట చీకటి చీరకప్పుకుంది రాత్రి. ఎదురింటిలో వెలుగుతున్న దీపంతప్ప అంతా నిశీథి. ఆమడ దూరంలోవున్న జీపు ప్రక్కన పరున్నదో కుక్క.




"చీకటిపడింది యిక లోపలికి వచ్చెయండి" అంటూ మందస్వరంలో మోహినా పిలవగా గదిలోకి వెళ్ళేను. గదిలో నులకమంచంమీద నా పక్క పరచబడి వుంది ఒకమూల మట్టితో చేసిన గాదెలాంటిది- బహుశా జొన్నలు అవి వుంచుకోడానికి కాబోలు, యింకో వేపు వ్రేలాడుతూవున్న తొలుగుమీద తీరుగా పెట్టిన బట్టలు, గోడకి కొట్టిన పెద్ద మేకుకి సిల్లింగుతో తగిలించిన తుపాకీ. నా కోసం ఆ గది అప్పటికప్పుడు ఖాళీ చేసినట్లు వుంది గ్లాసుతో నీళ్ళు. స్టూలు మీద పెట్టి "ఏది కావాలన్నా నన్ను పిలవండి, నేను పక్కగదిలో వుంటాను" అని వెళ్ళిపోయింది మోహినా.

గుడ్డిదీపం వెలుగులో పుస్తకపఠనం చేతకాక నిద్రాదేవి ఒడిలో నన్ను నే మర్చిపోవాలని ప్రయత్నించేను కాని ఒకంతకూ నిద్ర రావడంలేదు.

ఎడారి గర్భంలోవున్న ఆ యింటిలో అప్సరసలాంటి అందాలరాశితో ఒంటరివాడ్ని. ఏదో భయం. యుగయుగాల సంఘర్షణకి కూడా చెక్కుచెదరని కోనార్క రాతిబొమ్మలదర్పం వుంది మోహినాలో. బలమైన అవయవాలు, గర్వంగా నిలుచున్న ఆ రొమ్ముల పొంగు అద్వితీయం. రెండు కొండలమధ్య లోయలాంటి నడుం. నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. నాలో ఏదో రభస. ఏదో జరగబోతూవుంది. దానికి సిద్ధంగా వున్నానా? రక్తం, నరాలు వేడెక్కి శరీరం తలబిష్టతో బిగిసిపోతూవుంది. శరీరాన్ని విరిచి మంచానికి కట్టితే బాగుండేదేమో అన్నట్లు సలుపుతో బాధ. మోహినా సౌందర్యంలో పురుషుడ్ని లాలించి, సేద తీర్చే లాలిత్యం లేదు. కళ్ళు మిరుమిట్లు గొలిపి, కోరికల్ని రెచ్చగొట్టి, అందాం రాపిడిలో పురుషత్వాన్ని సవాలుచేస్తూ,

ఘా సభోంతరాల్లో పిచ్చిగా తనతోపరిభ్ర మించుకునే ప్రబంధ సుందరుల రూప లావణ్యం ఆమెది. ఏ తపోనిధులో, ఏ యుగపురుషులో తప్ప నాలాంటి సామా న్యుడు అందుకుని ఆస్వాదించి, స్వర్గాలు చూస్తూ, చూపించగలిగే స్త్రీ స్వరూపి ణిలా లేదామె.

ఒకంతకూ నిద్రపట్టడంలేదు. మంచం మీద దొర్లేను. తాళ్ళ రాపిడికి కిర్రుకిర్రు మంది మంచం. శరీరంలో బిగువు కొంత తగ్గింది. కాని చెవులు వేడెక్కి కుంప టిలా వున్నాయి. నీళ్ళగ్లాసుకోసం చెయ్యి చాచేను చెయ్యితగిలి గ్లాసు పెద్ద శబ్దం చేస్తూ పడిపోయింది.

"ఏమైంది సాహబ్" అంటూ పక్క గదినుండి వచ్చింది మొహిణా,


ఆమె కళ్లల్లో చిలిపితనం కావాలనే నవ్వే అర్థంలేని ఆమె చిరునవ్వు మిల మిలా మెరిసిపోతూవున్న నయనాలు. లేచి కూర్చున్నాను మంచంమీద. నేల మీదపడ్డ నీరు చూసి అర్థంచేసుకుంది కాబోలు క్రిందపడిన గ్లాసుతీసి స్టూలు మీద పెట్టింది. గ్లాసుమీద పెట్టిన మూత కోసం వెతుకుతూ చిన్నపిల్లలా మంచం క్రిందకు పాకుతూవుండగా ఆమె పిరు దులు నా పిక్కలను స్పృశించేయి. క్షణ కాలం నా కళ్ళముందు అంధకారం. శరీరం ఆధీనం తప్పిగాలిలో తేలిపోతూ వున్నట్లనిపించింది. ఆమె నన్ను తాకా లనేతాకింది. దానిలో ఏమాత్రంసంశయం లేదు. నన్ను వుద్రిక్తపరచి, రెచ్చగొట్ట టానికి కాకపోతే యింకోవేపునుండి మంచంక్రిందికి దూరేది. అసలు అంత రాత్రివేళ, ఎవరూ లేని యింటిలో పర పురుషుని సామీప్యానికి రావడంలో అర్థం?

ఒకవేపు సంస్కారం, సభ్యతపు; యింకోవేపు శరీరవాంఛల రాపిడిలో పరిసరాల్ని మర్చిపోయిన నేను ఆమె గదినుండి ఎప్పుడు వెళ్ళిపోయిందో చూడ లేదు. మరి కొద్దిక్షణాల్లో గదిలోకి కాలు పెడ్తూ,

"ఈ పాలు తాగండి. కడుపునిండితే నన్నా మీకు నిద్రపట్టవచ్చు" అంటూ గ్లాసు అందించబోయింది.

"అలాగే, అక్కడ పెట్టండి" అని ఆమెను చూడకూడదని ముఖం పక్కకు తిప్పుకున్నాను.

"ఊఁహుఁ అలాకాదు. యిప్పుడే తాగాలి. పాలు తాగి గ్లాసు ఖాళీచేస్తేనేత్త తీసుకువస్తాను. మీను రాత్రి దాహంవేస్తే మళ్ళా నేను రావాలి పిలుస్తే" అంటూ దగ్గరగా వచ్చేసింది. గ్లాసు అందుకో డానికి నిలుచుండబోతూ వుండగా, ఆమె నాకు మరికొంత దగ్గరగా జరి గిందేమో, నా ఎడమభుజం ఆమె భుజా నికి రాసుకుంది. మెరుపు మెరసి ఆరి పోగా వ్యాపించే చీకటి తలగ్రిరున తిరిగి పోయింది. అందుబాటులో వున్న ఆ




నిండు శరీరాన్ని కావలించుకుని కళ్ళు మూసుకోవాలనిపించింది. నోట మాట రావడంలేదు. శరీరం అధీనం తప్పిపోతూ వుంది. పాలగ్లాసు అందుకోవడానికి చెయ్యి కదపలేకపోయాను. దేన్నో వెదికే ఆమె కళ్ళలోకి చూస్తూవున్న నాకు ఆమె వేడి శ్వాస తగుల్తూ వుండగా పాలగ్లాసు అందుకోడంలో నా చేతిలోకి ఆమె వేళ్ళు యిమిడిపోవడంవల్ల నేను గ్లాసులాగడంతో గ్లాసుతోబాటు ఆమె నాకు చేరువైంది. రెండు శరీరాలూ ఒక దాన్ని ఒకటి వొత్తుకున్నాయి. మెత్తని స్పర్శ, అనూహ్యమైన అశక్తత, మైకంలో గుండెలు ఉధృతంగా కొట్టుకుంటూ వున్నాయి. ఎదురుగా గోడకు వ్రేలాడుతూవున్న తుపాకీ. నా గమ్యం, నా కర్తవ్యం నా ముందు నిలుచుని నవ్వుతూ వున్నట్లు ఎక్కడనుండో గలగలనవ్వులు. అక్కడ మరోక్షణం ఆలస్యంచేస్తే నేనూ నాతోపాటు ఎక్కడో దేశ సరిహద్దుల్లో గస్తీ చేస్తూవున్న ఒక సైనికుని గౌరవం రసాతలంకి జారిపోతాయి. పారిపోవాలి. నిశీథి ఒడిలో దాక్కోవాలి.

"మోహినా, ఒక్కనిమిషంలో వస్తా" అంటూ బయటపడి గదితలుపు పైనుండి గొళ్ళెంపెట్టి వెళ్ళి దగ్గరలోవున్న జీపులో కూర్చున్నాను.

నాలో భయం-ఏదో దోపిడీచేసి పారిపోతూవున్నట్లు. నల్లచీర ముసుగులో నున్న నిశాదేవి ఆశ్రయంలో ఒంటరివాణ్ని. ఆకాశాన మిల్కీవే దేవతలంకోసం వేసిన బాటలా వుంది. ఈ తారకల పందిరిలో నాకు దూరంగా పిల్లల్ని యిద్దర్నీ చెరొకప్రక్క వేసుకుని ఏ కలతలూ లేకుండా హాయిగా నిద్రపోతూ వుంటుంది నా ప్రియసఖి-సరళ. నాకే

మంత్రసిద్ధులు వుండేక్షణకాలంలో ఆమె సమక్షంలో ప్రత్యక్షమై ఆమె ఒడిలో వాలిపోయి సేద తీర్చుకునేవాడిని. ఏ పూర్వజన్మ పాపాలకో పరిహారం చెల్లించుకుంటూ వున్నాను యిక్కడ. గంగా స్నానాలు, పుష్కరిణి పూజలు ఎన్నో చేసేను. కాని లాభం? ఏవేవో తర్కానికి; నిజానికి యోజనాల దూరంలోవున్న ఆలోచనలతో జీపులో ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

"సాహబ్ మీరు ఒంటరిగా జీపులో ఎందుకున్నారు?" అంటూ ప్రశ్నిస్తూవున్న రుధిర్‌సింగు మాటలకు కళ్ళుతెరిచేను. చేతి వాచీ రెండు గంటలు చూపించింది.

''లోపల ఉక్కగావుంది. నాకు నిద్ర పట్టక యిలా బయటకు వచ్చేశాను. మంచం బయటవేయిస్తే మిగిలిన రెండు మూడు గంటలు నిద్రపోయి రేపు సూర్యోదయం కాకముందే వెళ్ళిపోతాం" అని నేను అనగా, రుధిర్‌సింగు, దీనానాథ్ కలసి మంచం బయటకు తీసుకొచ్చేరు.

ఏదో కొత్తశక్తి, బలం పుంజుకుంది శరీరం. "జైసల్‌మేర్ చేరుకుని సర్క్యూట్ హౌస్‌లో కాలకృత్యాలు తీర్చుకోవచ్చు" అని నాకు నేను చెప్పుకుని నిశ్చింతగా నిద్రపోయేను.

తెలతెలవారుతూ వుండగా మా ప్రయాణం

"సాహబ్, మొహినా మీ కోసం ఈ మూట యిచ్చింది. దీనిలో జొన్నరొట్టెలు, వెన్నముద్ద, ఆవకాయ వున్నాయి. 'మీ నాస్తా అట" అంటూ చిన్న గుడ్డసంచి జీపు వెనకసీట్లో వుంచేడు రుధిర్‌సింగు.

ద్వారం ముందర నిలబడి నావేపు చూస్తూ నవ్వుతూ నమస్కరించింది మొహినా.

"ఈ యుద్ధంలో నేను బ్రతికిబయటపడితే నా భార్యాపిల్లలతో మరొక్కసారి నీ జొన్నరొట్టెలు తినడానికి తప్పక వస్తాను మొహినా'' అని ప్రతి నమస్కారంగా సెల్యూటుచేసి జీపుని పరుగెత్తించేను దూళి రేపుకుంటూ.

